సాక్షి సంగారెడ్డి

శనివారం। 19। అక్టోబర్। 2024



ప్లాట్లు సేల్ అయితలేవ్

'సుడా' లే అవుట్‌కు స్పందన కరువైంది. కొనుగోళ్లకు ప్రజలు ఆసక్తి చూపడంలేదు.

వివరాలు 8లో ▸



పారదర్శకతతో విచారణ..

పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ప్రతి కేసును పారదర్శకతతో చేపట్టాని సీపీ అనురాధ సూచించరారు. వివరాలు 8లో ▸



పెద్దచెరువుకు ముప్పు!

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అందోల్ పెద్ద చెరువు వింగ్ వాల్‌కు రంధ్రం ఏర్పడింది.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఉద్యోగుల సంక్షేమానికి కృషి

టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జావీద్ అలీ



సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న టీఎన్జీవో నేతలు

సంగారెడ్డి రూరల్: ఉద్యోగుల సంక్షేమానికి తమ సంఘం కృషి చేస్తోందని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు జావిద్ అలీ పేర్కొన్నారు. సంగారెడ్డిలో శుక్రవారం నీటిపారుదల శాఖ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జావిద్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి ప్రతి ఉద్యోగి భాగస్వామ్యం కావాలన్నారు. సభ్యత్వం తీసుకోవడం ఉద్యోగుల హక్కుల రక్షణకు అని పేర్కొన్నారు. సంఘం కార్యదర్శి రవి మాట్లాడుతూ, టీఎన్జీవోస్ సభ్యత్వం ద్వారా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు సమష్టి కృషి అవసరమని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు కొసిని శ్రీకాంత్, వెంకట్ రెడ్డి, ట్రెజరర్ శ్రీనివాస్, ప్రమోద్, వెంకటేశం, పట్టణ అధ్యక్షులు శివరాజ్, కార్యదర్శి యాదవ్ రెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యాన విశ్వవిద్యాలయ వీసీగా రాజిరెడ్డి



ములుగు(గజ్వేల్): కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ రాజిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ వీసీగా పనిచేసిన డాక్టర్.బి.నీరజ ప్రభాకర్ రాజేంద్రనగర్‌లోని జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్‌గా బదిలీపై వెళ్లారు.

జెడ్‌పీఎల్ టోర్నీ విజేత సేవాలాల్ టీం



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న చంద్రశేఖర్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రీమియర్ లీగ్ (జెడ్‌పీఎల్) విజేతగా సేవాలాల్ జట్టు నిలిచింది. క్రికెట్ టోర్నీ ఫైనల్‌లో ఆల్ ఖురేషి జట్టు ఓటమి చవిచూసింది. విన్నర్ జట్టుకు కాంగ్రెస్ జహీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి చంద్రశేఖర్ రూ. 60 వేలతోపాటు ట్రోఫీ, రన్నరప్‌కు న్యాయవాది శ్రీనివాస్‌రెడ్డి రూ. 60 వేలతోపాటు జ్ఞాపికలను అందజేశారు. పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో వారం రోజుల పాటు జెడ్‌పీఎల్ క్రికెట్ టోర్నీ జరుగగా ఇందులో 22 జట్లు పాల్గొన్నాయి. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సేవాలాల్ జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో నిర్వాహకులు నహీం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అప్రెంటీస్ మేళా

హత్నూర(సంగారెడ్డి): ఈనెల 21న జిల్లాలోని ఐటీఐ విద్యార్థులకు అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు హత్నూర ప్రభుత్వ ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి శుక్రవారం తెలిపారు. వివిధ పరిశ్రమల్లో అప్రెంటీస్‌గా పని చేసేందుకు గాను ఈ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందుకోసం 2వ తేదీ ఉదయం 8 గంటల నుంచి విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణమైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పెండింగ్ డీఏలు చెల్లించండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఐదు డీఏలను వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్య వైఖరిని వీడాలన్నారు. ఇప్పటికి రావాల్సిన ఐదు పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలన్నారు. 2023 జూలై నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీని వెంటనే అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు నష్టం చేకూర్చే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు వెంటనే చేకూర్చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, సిద్దిపేట అర్బన్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క క్లిక్‌తో సమాచారం

పాఠశాలల అభివృద్ధికి యూ డైస్ ప్లస్

- దీని ఆధారంగా నిధులు కేటాయింపు
- జిల్లాలో 1,256 ప్రభుత్వ పాఠశాలలు
- 1,41,401 మంది విద్యార్థులు



విద్యా వ్యవస్థ సమగ్ర సమాచారాన్ని ఒకేచోట నిక్షిప్తం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంటున్నది. అందుకోసం యూ డైస్ ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్) వెబ్‌సైట్‌ను రూపొందించింది. దీంతో ఇకపై ఒక్క క్లిక్‌తో ప్రభుత్వ పాఠశాలల పూర్తి సమాచారం వెబ్‌సైట్‌లో ప్రత్యక్షం కానున్నది. పాఠశాలల స్థితిగతులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సమాచారంతో పాటు మౌలిక వసతులు ఏ పాఠశాలలో ఎలా ఉన్నాయో, ఎంతమంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అయ్యారో అనే విషయాలు స్పష్టంగా తెలియనున్నాయి.

సదాశివపేట రూరల్(సంగారెడ్డి)...

2021–22 వరకు యూడైస్‌గా కొనసాగగా.. ఆ తర్వాత యూడైస్ ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్)గా ఆధునికీకరించారు. గతంలో ఏడాదికోసారి సమాచారం అప్‌డేట్ చేయగా.. ఇకపై మూడు గంటలకోసారి సాంకేతికత ఆధారంగా సమాచారాన్ని అప్‌డేట్ చేసే అవకాశం ఉంది. పాఠశాల మౌలిక వసతులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మాడ్యుల్స్‌గా వెబ్‌సైట్‌ను మూడు భాగాలుగా విభజించి సమాచారం నిక్షిప్తం చేస్తున్నారు. ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయుల నేతృత్వంలో ఈ ప్రక్రియ కొనసాగుతున్నది. అంశాల వారీగా వెబ్‌సైట్‌లో వివరాలను అప్‌లోడ్ చేస్తున్నారు.

సమస్త సమాచారం నిక్షిప్తం

జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో కేజీ నుంచి ఇంటర్ వరకు చదువుకుంటున్న ప్రతి విద్యార్థి వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలు ఉండగా.. ప్రస్తుత సమాచారంతో అప్‌డేట్ చేస్తున్నారు. అలాగే పాఠశాలల్లోని తరగతి గదులు, మరుగుదొడ్లు, వంట గదులు, తాగునీరు తదితర సదుపాయాల వివరాలతోపాటు వాటి స్థితిగతులపై తాజా సమాచారాన్ని పొందుపరుస్తున్నారు.

వివరాలు కీలకం

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ పరంగా అందుతున్న వసతుల కల్పనకు యూడైస్ ప్లస్‌లోని వివరాలు కీలకం కానున్నాయి. అవినీతికి పాల్పడకుండా ఈ విధానం ఉపయోగపడనున్నది. వెబ్‌సైట్‌లో నమోదైన విద్యార్థులకే ఇకపై యూనిఫాం, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు తదితర వాటిని అందించనున్నారు. అన్ని పాఠశాలల సమాచారాన్ని సైతం వెబ్‌సైట్‌లో ఉండడంతో ఇక నుంచి ఆ వివరాల ఆధారంగానే పాఠశాలల్లో వసతుల కల్పనకు ప్రభుత్వ పరంగా నిధులు మంజూరు కానున్నాయి.

ప్రతి విద్యార్థికి నంబర్ కేటాయింపు

యూ డైస్ ప్లస్ పోర్టల్ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తుంది. ప్రతి ఏడాది అన్ని పాఠశాలల్లో సమగ్ర వివరాలను ప్రధానోపాధ్యాయులు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందులో నమోదు చేసిన ప్రతి విద్యార్థికి ఒక పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ (పీఈఎన్) కేటాయిస్తారు. దీని ద్వారా ఆ విద్యార్థి దేశవ్యాప్తంగా ఏఏ పాఠశాలల్లో ఏఏ తరగతులు చదివాడు అనేది కచ్చితంగా తెలుస్తుంది. పదో తరగతి విద్యార్థి బోర్డు పరీక్షలు రాయాలంటే ఇందులో నమోదై ఉండాల్సిందే.

> **నమోదు ప్రక్రియ కొనసాగుతుంది**
>
> ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. గతంలో ఏడాదికోసారి సమాచారం అప్‌డేట్ చేసే అవకాశం ఉండేది. ఇకపై మూడు గంటలకోసారి సాంకేతికత ఆధారంగా సమాచారాన్ని అప్‌డేట్ చేస్తారు. అలాగే.. యూ డైస్ ప్లస్‌లోని సమాచారం ఆధారంగా ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల సదుపాయాలకు నిధులు కేటాయించే అవకాశం ఉంది.
>
> –వెంకటేశ్వర్లు,
> జిల్లా విద్యాధికారి, సంగారెడ్డి

గ్రూప్–3 పరీక్షలకు ఏర్పాట్లు



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ క్రాంతి, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

- 17వేల మంది అభ్యర్థులు.. 49 పరీక్ష కేంద్రాలు
- అవసరమైతే అన్ని శాఖల సహకారం: కలెక్టర్

సంగారెడ్డి జోన్: జిల్లాలో గ్రూప్– 3 పరీక్షలకు 17వేల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. మొత్తం 49 పరీక్ష కేంద్రాలను గుర్తించామన్నారు. శుక్రవారం రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ కార్యాలయం నుంచి అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ కలసి ఆమె హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే అధికారులు ఈ కేంద్రాలను సందర్శించి వసతి సదుపాయాలను పరిశీలించినట్లు తెలిపారు. గ్రూప్–3 పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రాలు, ఇతర మెటీరియల్‌ను కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య భద్రపరిచేందుకు రెండు స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా సిబ్బందిని నియమిస్తామని, అవసరమైతే ఇతర శాఖల సహకారం తీసుకుంటామన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నామని వివరించారు.

ఏటీసీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

యువతలో వృత్తి నైపుణ్యాలు పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణ ఆధ్వర్యంలో నూతనంగా నెలకొల్పిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాల (ఏటీసీ)ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ క్రాంతి సూచించారు. శుక్రవారం ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి సంజయ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఏటీసీ కేంద్రాలలో ప్రవేశాలు వేగవంతం అయ్యేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్రాలలో శిక్షణ కొరకు ఏర్పాట్లు పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. తొలి విడతలో భాగంగా సంగారెడ్డి, హత్నూర ఐటీఐ కళాశాలను గుర్తించి ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేశామన్నారు. ఈనెల 31 వరకు అర్హులైన, ఆసక్తిగల విద్యార్థులు ప్రవేశాలు పొంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

> **దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం చేయాలి**
>
> ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి, దరఖాస్తులు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తుది దశకు ఇందిరమ్మ కమిటీలు

- ఏడుగురితో కలిసి ఒక కమిటీ
- పారదర్శకంగా చేపట్టాలని సర్కార్ ఆదేశం
- నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు!

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కసరత్తు ప్రారంభించింది. అర్హులైన వారికి ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇందిరమ్మ కమిటీలను వేసే ప్రక్రియను వేగవంతం చేసింది. ప్రస్తుతం ఇందిరమ్మ కమిటీల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ప్రతి గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున, మున్సిపల్ పరిధిలోని వార్డుకు ఒకటి చొప్పున ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఏడుగురు సభ్యులతో కలిసి ఒక కమిటీ ఉంటుంది. గ్రామ పంచాయతీలో సర్పంచ్ లేదా ప్రత్యేక అధికారి, స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు ఇద్దరూ, ముగ్గురు స్థానికులతో పాటు పంచాయతీ కార్యదర్శి ఉంటారు. గ్రామాలలో ప్రతిపాదించిన కమిటీల ప్రక్రియ అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రితోపాటు కలెక్టర్‌తో సంప్రదించి అధికారికంగా ప్రకటించి, విధి విధానాలను జారీ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 646 గ్రామ పంచాయతీలు, ఎనిమిది మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆయా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు ప్రక్రియ చివరి దశలో ఉన్నట్లు సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి తొలుత 3,500 ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు మంజూరు చేయనుంది. ఒక్కో ఇంటి నిర్మాణానికి ఎంపికైన లబ్ధిదారులకు రూ.5లక్షలు మంజూరు చేయనుంది. గ్రామాలలో నూతనంగా ఏర్పడిన ఇందిరమ్మ కమిటీల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండేందుకు చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నూతనంగా ఏర్పడిన కమిటీ చేపట్టనుంది. ఇళ్ల నిర్మాణాలలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తుంది.

పారదర్శకంగా కమిటీలు: గూడెం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ఇందిరమ్మ కమిటీల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆదేశించారు. పటాన్‌చెరులోని క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులతో ఇందిరమ్మ ఇళ్ల పథకం విధివిధానాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సూచించిన నిబంధనలకు అనుగుణంగా గ్రామసభలు ఏర్పాటు చేసి గ్రామ కమిటీలు, వార్డు కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు అర్హులైన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని సూచించారు. ఈ పథకం కింద ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు సొంతంగా ఖాళీగా జాగా ఉంటే ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు సాయం అందించనున్నట్లు తెలిపారు. నిరుపేదలకు జాగా లేకుంటే అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత వారికి ఇంటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో ఎట్టి పరిస్థితుల్లోనూ అవకతవకలు జరగడానికి వీలు లేదన్నారు. త్వరలోనే ప్రభుత్వం లాంఛనంగా ఈ పథకాన్ని ప్రారంభించనుందని పేర్కొన్నారు.

పేద పిల్లలకు కంప్యూటర్ పరిజ్ఞానం

సర్కారు బడుల్లో ఉచిత బోధన

- బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు
- ఖేడ్‌లో మూడో పాఠశాలలో ఏర్పాటు
- నియోజకవర్గంలో విస్తరణకు చర్యలు



నారాయణఖేడ్: విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ విద్య అందిస్తున్న శ్రీకృష్ణ పాడిశెట్టి

నారాయణఖేడ్: పేద విద్యార్థుల ఉన్నతే లక్ష్యంగా 'బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్'ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ విద్యను అందిస్తున్నారు. నారాయణఖేడ్‌లో మరో పాఠశాలలో కంప్యూటర్ విద్యను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థుల ఉన్నతే లక్ష్యంగా.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ విద్య ఎంతో ప్రాముఖ్యత ఉండడంతో పేద విద్యార్థులను ఆ విద్య వైపు మళ్లేలా చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులు డబ్బులు వెచ్చించి కంప్యూటర్ విద్య, పరిజ్ఞానం పొందలేక వారి ప్రతిభ, నైపుణ్యతను వెలికి తీయలేకపోతున్నారు. ఈ సమస్య నివారణకు సంస్థ నడుం కట్టింది. రాష్ట్రంలో ఇటీవల పాలకుర్తిలో 2 పాఠశాలలు, నారాయణఖేడ్‌లో 2, సంగారెడ్డిలో 1, హైదరాబాద్‌లో కంటోన్మెంట్, ఖైరతాబాద్, అసెంబ్లీ ప్రాంతంలలో 4 పాఠశాలలు, ఖమ్మంలో 2 పాఠశాలల చొప్పున ఇటీవల కంప్యూటర్ విద్యను ప్రారంభించారు. నారాయణఖేడ్ రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడి ఉండడంతో ఈ ప్రాంతంపై మరింత దృష్టి సారించారు. విడతల వారీగా మెజార్టీ పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించేందుకు ఏర్పాట్లు చేపట్టారు.

ఒక్కో పాఠశాలకు రూ.5లక్షల ఖర్చు

ఫౌండేషన్ ద్వారా చేపడుతున్న కంప్యూటర్ విద్యకు సుమారు రూ.5లక్షల వరకు ఖర్చవుతుంది. పాఠశాలలో 10 కంప్యూటర్లు, ఇంటర్నెట్, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నారు. సంస్థలకు సాఫ్ట్‌వేర్ కంపెనీలోని ఉద్యోగులను ఫ్యాకల్టీలుగా ఏర్పాటు చేసి విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అందజేస్తున్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు వరకు కంప్యూటర్ విద్యాబోధన జరుగుతుంది. ఇప్పటివరకు రాష్ట్రంలో 10వేల మంది విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించారు. మూడు నెలలకు ఒక బ్యాచ్ చొప్పున అన్ని తరగతుల విద్యార్థులకు విద్యను అందజేస్తున్నారు. నారాయణఖేడ్‌లోని ఉన్నత పాఠశాలలో 800మంది విద్యార్థులు, బాలికల ఉన్నత పాఠశాలలో 900మంది విద్యార్థులు ఉండగా రెండు చొప్పున కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. నెలరోజుల్లో ఉన్నత పాఠశాలలో 70మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 85మంది విద్యార్థులు కంప్యూటర్ విద్యను పొందారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల్లో కంప్యూటర్ ల్యాబ్‌ను సంస్థ ద్వారా ఏర్పాటు చేసేందుకు ఏర్పాటు చేస్తున్నారు.

> **కంప్యూటర్ విద్య బాగుంది**
>
> 
>
> పాఠశాలలో కంప్యూటర్ బోధన ఉచితంగా అందజేస్తున్నారు. నిత్యం వెంకటాపూర్ గ్రామం నుంచి పాఠశాలకు వస్తాను. కంప్యూటర్ విద్య డబ్బులు వెచ్చించి చదువుకునే పరిస్థితి లేదు. పాఠశాలలో బాగా నేర్పిస్తున్నారు. భవిష్యత్‌లో ఈ విద్య నా ఉన్నతికి ఎంతగానో తోడ్పడగలదు. – జి.సహర్ష్, ఉన్నత పాఠశాల, నారాయణఖేడ్

> **పేద విద్యార్థుల ఉన్నతే లక్ష్యం**
>
> 
>
> పేద విద్యార్థులు సైతం కార్పొరేట్ స్థాయిలో మంచి కంప్యూటర్ పరిజ్ఞానం పొందాలన్నదే లక్ష్యం. దీంతో వారు జీవితంలో ఎదిగేందుకు కంప్యూటర్ విద్య దోహద పడుతుంది. ఇప్పటివరకు 10వేల మంది విద్యార్థులకు 500మంది ఉత్సాహవంతులైన వలంటీర్లను ఏర్పాటు చేసి కంప్యూటర్ విద్య అందిస్తున్నాం. ఖేడ్ ప్రాంతంలో రెండు పాఠశాలల్లో ఏర్పాటు చేయగా ఈ సేవలు మరింత విస్తృత పర్చనున్నాం. – శ్రీకృష్ణ పాడిశెట్టి, బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు

విద్యుత్ శాఖకు రూ.9 కోట్లు

- పెండింగ్ పనులు పూర్తి చేయండి
- మంత్రి దామోదర ఆదేశం

జోగిపేట(అందోల్): అందోలు నియోజకవర్గంలో విద్యుత్ శాఖకు సంబంధించి మంజూరైన రూ.9 కోట్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సంబంధించి శుక్రవారం హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మేడ్చల్ చీఫ్ ఇంజనీర్ కామేష్, సంగారెడ్డి సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీనాథ్, జోగిపేట డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. నియోజకవర్గంలో పురోగతిలో ఉన్న పనుల వేగాన్ని సమీక్షించారు. 9 కోట్ల అంచనాలతో జరుగుతున్న పనుల పట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారు. వేసవి, రబీ సీజన్లలో నియోజకవర్గంలో నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించాలని మంత్రి సూచించారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్), 11 కేవీ ఇంటర్‌లింకింగ్ లైన్‌లు, 33 కేవీ సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుతో సహా వ్యవసాయ మౌలిక సదుపాయాలు అత్యంత ప్రాధాన్యతగా చేపడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయ కార్యకలాపాలకు తోడ్పడటానికి ఈ ప్రాంతంలో మొత్తం విద్యుత్ మెరుగుపరచడానికి అవసరమైన ఈ పనులను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. గృహ, వ్యవసాయ రంగానికి అవసరమైన విద్యుత్ సరఫరాల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని మంత్రి పేర్కొన్నారు.



మంత్రి దామోదరకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

సిద్దిపేట సిన్నబోతుందా?

హుస్నాబాద్, బెజ్జంకిలతో తగ్గనున్న జిల్లా పరిధి?

- సిద్దిపేటలో బలవంతంగా కలిపారంటూ మంత్రి పొన్నం వ్యాఖ్యలు
- జిల్లా వ్యాప్తంగా హాట్‌హాట్ చర్చ



సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట జిల్లా పునర్విభజన అంశం మరోమారు తెరపైకి వచ్చింది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కేడం లింగమూర్తి ప్రమాణస్వీకారం సందర్భంగా హుస్నాబాద్‌పై మంత్రి పొన్నం చేసిన వ్యాఖ్యలు జిల్లా వ్యాప్తంగా చర్చకు దారితీస్తున్నాయి. హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలు సిద్దిపేట జిల్లాలో బలవంతంగా కలిపారని, ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని అన్నారు. దీంతో కరీంనగర్ జిల్లాలో హుస్నాబాద్ కలవనుందా? అని పలువురు చర్చించుకుంటున్నారు.

23 మండలాలతో..

సిద్దిపేట జిల్లాగా 23 మండలాలతో 11 అక్టోబర్ 2016న ఆవిర్భవించింది. తర్వాత పలు చోట్ల ప్రత్యేక మండలం కావాలని ఉద్యమాలు చేయడంతో కుకునూరుపల్లి, అక్బర్‌పేట-భూంపల్లి, దూల్మిట్ట మండలాలను ఏర్పాటు చేశారు. దీంతో 26 మండలాలకు చేరింది.

హుస్నాబాద్ మూడు జిల్లాల పరిధి

హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో ఉంది. హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలు సిద్దిపేట జిల్లాలో, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలను హన్మకొండ జిల్లాలో, చిగురుమామిడి, సైదాపూర్ మండలాలు కరీంనగర్ జిల్లాలో కొనసాగుతున్నాయి. అప్పట్లో కరీంనగర్ జిల్లా నుంచి తమను వేరుచేయడంపై హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల ప్రజలు ఆందోళనలు చేశారు. వీటిని కరీంనగర్ జిల్లాలో కలుపుతామని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. అలాగే గతంలో పాదయాత్ర సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కరీంనగర్‌లో హుస్నాబాద్‌ను కలుపుతామని సీఎం రేవంత్‌రెడ్డి సైతం హామీ ఇచ్చారు.

బెజ్జంకిలో ఉద్యమం

బెజ్జంకి మండలాన్ని సైతం కరీంనగర్‌లో కలపాలని కరీంనగర్ సాధన సమితి పేరుతో బెజ్జంకి ప్రజలు ఉద్యమిస్తున్నారు. ఇటీవల మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు వినతి పత్రం సైతం అందించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని మూడు మండలాలు కరీంనగర్‌లో కలిపేందుకు మంత్రి పొన్నం మక్కువ చూపుతున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

స్నేహితుడి ఇంట్లో చోరీ

యువకుడి అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): స్నేహితుడి ఇంట్లోనే దొంగతనానికి పాల్పడిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ మహేందర్‌రెడ్డి కథనం మేరకు.. జగదేవ్‌పూర్ మండలం మునిగడప గ్రామానికి చెందిన తలారి సురేశ్ రెండు వారాల కిందట బంధువుల ఇంటికి వెళ్లారు. సురేశ్ స్నేహితుడు తుమ్మ నవీన్ ఇదే అదునుగా భావించి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. అర తులం బంగారం, రూ.25 వేల నగదు ఎత్తుకెళ్లాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సురేశ్ ఇంటి పక్కన ఉన్న తుమ్మ నవీన్‌తోపాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఇందులో తానే దొంగతనం చేసినట్లు నవీన్ ఒప్పుకున్నాడు. వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని చిలాపూర్ పల్లెలో శుక్రవారం కుక్కల దాడి చేయడంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఒకటవ తరగతి విద్యార్థి గజ్జెల రిషికతోపాటు గ్రామ పంచాయతీ కార్మికుడు గజ్జెల సంతోష్ తీవ్రంగా గాయపడ్డారు. రిషిక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల నుంచి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. ఇది గమనించిన సంతోష్ కుక్కను తరవడంతో అతడిపై దాడి చేశాయి. అలాగే గుండారం గ్రామానికి చెందిన మిర్యాల రమేశ్‌పై దాడి చేశాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి అదృశ్యం



షాబొద్దీన్ (ఫైల్)

సిద్దిపేటరూరల్: వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని ఇర్కోడ్ దర్గా వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సిద్దిపేటకు చెందిన ఎండీ.షాబొద్దీన్ పదేళ్లుగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఐదేళ్ల నుంచి రూరల్ మండల పరిధిలోని ఇర్కోడ్ దర్గా వద్ద ఉంటూ నివసిస్తున్నాడు. 14న ఉదయం కుటుంబీకులు వెళ్లి చూడగా షాబొద్దీన్ కనబడలేదు. స్నేహితులు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినప్పటికీ ఆచూకీ తెలియరాలేదు. షాబొద్దీన్ సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయి నిందితుడి అరెస్ట్

సదాశివపేట(సంగారెడ్డి): గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడిని అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు పంపించామని సీఐ మహేశ్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. సెప్టెంబర్ 11న ఒరిస్సా నుంచి ముంబాయికి 30 కేజీల ఎండుగంజాయిని తరలిస్తుండగా పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై ఒరిస్సా రాష్ట్రానికి చెందిన నిందితులు ప్రతాప్ స్వైన్, చంద్రురావు పట్టుబడ్డారు. రిమాండ్‌కు తరలించే సమయంలో నైట్ పోలీస్ కస్టడీ నుంచి నిందితుడు చంద్రురావు కాలకృత్యాల కోసం లేచి ఎస్కార్ట్‌లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ అసద్, శివకుమార్‌లను తోసి గోడ దూకిపారిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి చంద్రురావు సొంతూరు ఒరిస్సా రాష్ట్రం బేగున్యావుడా గ్రామంలో గురువారం సాయంత్రం పట్టుకున్నారు. సదాశివపేట పోలీస్ స్టేషన్‌కు తరలించి శుక్రవారం రిమాండ్‌కు తరలించామని సీఐ మహేశ్‌గౌడ్ తెలిపారు.

ప్లాట్లు సేల్ అయితలేవ్

- 'సుడా' లే అవుట్‌కు స్పందన కరువు
- మిట్టపల్లిలో తొలి అధికారిక వెంచర్
- 111 ప్లాట్లకు 13 ప్లాట్లు విక్రయం
- రూ.6.50 కోట్లతో మౌలిక వసతులు
- పట్టణానికి దూరం, ఎక్కువ ధరతో ముందుకురాని జనం
- ధర తగ్గించి మరోసారి వేలం వేసేలా అధికారుల చర్యలు



సుడా లే అవుట్ మ్యాప్

సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే మోడల్‌గా సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌కు ప్రజల నుంచి స్పందన కరువైంది. ప్లాట్లను విక్రయించేందుకు రెండు సార్లు బహిరంగ వేలం నిర్వహించినా ప్లాట్లను కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. లేఅవుట్ సిద్దిపేట పట్టణానికి దూరంగా ఉండడంతోపాటు మార్కెట్ రేటు కంటే ఎక్కువ ధర నిర్ణయించడంతో ప్రజలు ఆసక్తి చూపలేదనే చర్చ నడుస్తోంది.

– సిద్దిపేటఅర్బన్:

సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని 14 ఎకరాల అసైన్డ్ స్థలం సేకరించి లే అవుట్‌ను సిద్ధం చేసింది. ఇందులో రోడ్లు, డ్రైనేజీలు, పార్క్ పోగా మిగిలిన స్థలంలో 161 ప్లాట్లు సిద్ధం చేశారు. వాటిలో 60 ప్లాట్లను భూమిలిచ్చిన వారికి ఒక్కొక్కరికి 600 గజాల చొప్పున కేటాయించారు. మిగిలిన 111 ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించగా వచ్చిన ఆదాయాన్ని సిద్దిపేట పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు ఉపయోగించుకోవచ్చని భావించారు.

అమ్ముడుపోయినవి 13 మాత్రమే

గతేడాది ఏప్రిల్‌లో ప్లాట్ల బహిరంగ వేలంకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించారు. మే నెలలో బహిరంగ వేలం రెండు విడతలుగా నిర్వహించారు. గజం రూ. 8 వేలు కనీస ధర నిర్ణయించగా 111 ప్లాట్లకు 13 ప్లాట్లు మాత్రమే అమ్ముడుపోయాయి. అందులో 9 మంది పూర్తి డబ్బులు చెల్లించి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మరో నలుగురు 25 శాతం డబ్బులు మాత్రమే చెల్లించారు. వీటి ద్వారా సుడాకు రూ.1.50 కోట్ల ఆదాయం సమకూరింది.

రూ.6.50 కోట్లతో సగం పనులు

సుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వెంచర్‌లో మౌలిక వసతుల కల్పన కోసం రూ. 6.50 కోట్లు కేటాయించారు. దీనిలో భాగంగా రోడ్లు, డ్రైనేజీ, వాటర్ ట్యాంకు, వాటర్ పైపులైన్ పనులు సగం మాత్రమే పూర్తయ్యాయి. వెంచర్ ఎంట్రన్స్‌ను ఆకర్షణీయంగా ఆర్చ్ నిర్మించి నాలుగు వరుసల బీటీ రోడ్డును ప్లాట్ల వరకు పూర్తి చేశారు. వెంచర్‌లో మట్టిని చదును చేసి వదిలేశారు. ప్లాట్లకు డిమాండ్ లేకపోవడంతో పనులను మధ్యలోనే ఆపివేశారు.

భూములు తిరిగివ్వాలని రైతుల డిమాండ్

ప్లాట్ల విక్రయం కోసం ఇప్పటికే రెండు సార్లు బహిరంగ వేలం నిర్వహించగా ప్రజల నుంచి అనుకున్నంత స్థాయిలో స్పందన రాకపోవడంతో ఏం చేయాలో అధికారులకు అర్థం కాని పరిస్థితి. దీంతో కలెక్టర్ మను చౌదరి లేఅవుట్‌ను పరిశీలించారు. ప్రజల నుంచి స్పందన లేదని తెలుసుకొని ధర తగ్గించి మరోసారి బహిరంగ వేలం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్లాట్లు అమ్ముడుపోకపోవడంతో వెంచర్ కోసం భూములు ఇచ్చిన రైతులు తమ భూములు తిరిగివ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ధర తగ్గించి విక్రయించేందుకు..

"సుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసేందుకు రెండు సార్లు బహిరంగ వేలం నిర్వహించారు. ధర విషయంలో ప్రజలు ఆసక్తి చూపడం లేదని ధర తగ్గించి విక్రయించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అమ్ముడుపోగా మిగిలిన వాటి కోసం మరోసారి బహిరంగ వేలం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం."

– అశ్రితేకుమార్, సుడా వైస్ చైర్మన్

చికిత్స పొందుతూ శిశువు మృతి

ఇంజక్షన్ వికటించి చనిపోయిందని కుటుంబీకుల ఆరోపణ



చిన్నారి ఆరాధ్య



ఆందోళన చేస్తున్న చిన్నారి కుటుంబీకులు

కల్హేర్(నారాయణఖేడ్): అనారోగ్యంతో చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందగా, వైద్యుడి నిర్లక్ష్యంతోనే చనిపోయినట్లు కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. ఈ ఘటన మండల కేంద్రంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్లే.. కల్హేర్ మండల కేంద్రానికి చెందిన కోక్కొండ ఓంసాయి అనిత దంపతులకు 3 నెలల పాప ఆరాధ్య ఉంది. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న పాపను బుధవారం కల్హేర్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిల్ రెడ్డి పరీక్షించి వైద్యం అందించారు. ఇంజక్షన్ ఇచ్చినా ఆరోగ్యం మెరుగు పడకపోవడంతో సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు. కుటుంబీకులు బాన్సువాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్తుండగా చనిపోయింది. డాక్టర్ అనిల్ రెడ్డి నిర్లక్ష్యం కారణంగానే పాప మృతి చెందిందని కుటుంబీకులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. ఈ విషయమై డాక్టర్ మాట్లాడుతూ.. ఇంజక్షన్ వికటించి చిన్నారి చనిపోలేదని, తాము చేయాల్సినంత ప్రయత్నం చేశామని, తప్పేమిలేదని స్పష్టం చేశారు.ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని చిన్నారి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య




శంకర్(ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు..ఎల్కపల్లి గ్రామానికి చెందిన కానికే వెంకటేశ్ మొదటి భార్యకు కుమారుడు శంకర్(22), కూతురు శైలజ ఉన్నారు. 20 ఏళ్ల కిందట భార్య చనిపోవడంతో జంగరాయికి చెందిన దుర్గమ్మను రెండో వివాహం చేసుకోగా ఆమెకూ ఇద్దరు పిల్లలు. దంపతుల మధ్య ఏర్పడిన తగాదాలతో సుమారు 9 నెలల కిందట వెంకటేశ్ ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏడాదిన్నర కిందట మొదటి భార్య కూతురు శైలజ వివాహం కాగా, కుమారుడు శంకర్ సవతితల్లితో కలిసి ఉంటున్నాడు. గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో సవతి తల్లి దుర్గమ్మతో గొడవ జరుగగా మనస్తాపం చెంది ఇంటినుండి బయటకెళ్లిన శంకర్ వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి సోదరి శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మనస్తాపంతో ఉరేసుకొని..

జిన్నారం(పటాన్‌చెరు): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మంబాపూర్ గ్రామానికి చెందిన పల్లపు రాజు (35) రెండో భార్యతో కలిసి కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. మొదటి భార్యతో గొడవపడి విడాకులు తీసుకున్నాడు. తరచూ కుటుంబ కలహాలు అవుతుండటంతో పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా పెట్టారు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన రాజు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..



కాల్వలో యాదగిరి మృతదేహం

గజ్వేల్‌రూరల్: కాల్వలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని దాతర్‌పల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నాయిని యాదగిరి(40)కి భార్య వాణి, ఇద్దరు పిల్లలున్నారు. గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవించే యాదగిరి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ కొంతకాలంగా మనోవేదనకు గురవుతున్నాడు. గురువారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన యాదగిరి గ్రామ సమీపంలోని కొండపోచమ్మ కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అటుగా వెళ్లిన గ్రామస్తులు కాల్వలో మృతదేహం గుర్తించి బాధిత కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని యాదగిరి మృతదేహాన్ని బయటికి తీయించి, మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కూతురు హత్య కేసులో..

తల్లి, ప్రియుడికి జీవిత ఖైదు

సదాశివపేట(సంగారెడ్డి): కన్న కూతురు హత్య కేసులో తల్లి, ప్రియుడికి శిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ సెషన్స్ జడ్జి జీ.భవానీ శుక్రవారం తీర్పు చేప్పారని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా రాజాపూర్ మండలం, ఇబ్రహీంపల్లి గ్రామానికి చెందిన ఎం.వీరేశ్‌కు వికారాబాద్ జిల్లా షాబాద్ మండలం బోడపహడ్ గ్రామానికి చెందిన కల్పనతో వివాహం జరిగింది. కల్పన కాన్పు గురించి స్వగ్రామమైన బోడపహడ్ గ్రామానికి కూతుళ్లు భావ్య(3), భావన 9 నెలల పాపతో కలిసి వెళ్లింది. అప్పటికే వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం కేసారం గ్రామానికి చెదిన ట్రాక్టర్ డ్రైవర్ అలంపల్లి రాజుతో కల్పనకు వివాహేతర సంబంధం కొనసాగుతుంది. కాన్పుకని వెళ్లిన కల్పన ప్రియుడితో కలిసి సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని ప్రియదర్శిని కాలనీలో నివాసం ఉంటుంది. 2019 ఫిబ్రవరిలో కల్పన కూతురు భావ్య నాన్న అని పిలవడం లేదని నిందితుడు రాజు కోపంతో గోడకు బలంగా కొట్టి పాపను చంపేశాడు. మృతురాలి తండ్రి వీరేశం ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ శ్రీధర్‌రెడ్డి హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు తల్లి కల్పన, ప్రియుడు అలంపల్లి రాజులపై నేరం రుజువు కావడంతో శుక్రవారం జడ్జి నిందితులకు యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. నిందితులకు శిక్షపడేలా కృషి చేసిన అప్పటి సీఐ శ్రీధర్‌రెడ్డి, ప్రస్తుత సీఐ మహేశ్‌గౌడ్, పీపీ శైలజ, కోర్టు డ్యూటీ పీసీ రవి, వెంకటేశ్వర్లు, కోర్టు లైజనింగ్ అధికారి సత్యనారాయణ, ఎస్ఐలను ఎస్పీ అభినందించారు.

ప్రజాప్రతినిధికి సైబర్ నేరగాళ్ల ఫేక్ కాల్

- ఉద్యోగాలను ఎర చూపడంతో మోసపోయిన బాధితులు
- పోలీసులకు ఫిర్యాదు

గజ్వేల్‌రూరల్: ఓ ప్రజాప్రతినిధికి సైబర్ నేరస్తుడు ఫోన్ చేసి విద్యుత్‌శాఖలో ఉద్యోగాలున్నాయంటూ నమ్మించగా.. బాధితులు డబ్బులు చెల్లించి మోసపోయిన ఘటన గజ్వేల్‌లో చోటు చేసుకుంది. శుక్రవారం గజ్వేల్ సీఐ సైదా కథనం ప్రకారం.. గజ్వేల్ పట్టణానికి చెందిన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధికి సైబర్ నేరస్తుడు రెండ్రోజుల కిందట ఫోన్ చేసి విద్యుత్‌శాఖలో ఉద్యోగాలున్నాయని మీకు తెలిసిన వారితో దరఖాస్తులు చేయించాలని చెప్పాడు. ఇది నమ్మి తన సోదరుడైన మున్సిపల్‌లో ఉండే మరో ప్రజాప్రతినిధికి చెప్పాడు. అతడు పలువురు యువకులతో అప్లికేషన్ ఫీజు రూ. 1400, ప్రాసెసింగ్ ఫీజు రూ. 500 చొప్పున రెండు దఫాలుగా రూ. 1900 ఆన్‌లైన్‌లో సైబర్ నేరస్తుడికి ట్రాన్స్‌ఫర్ చేయించారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులకు ఈ విషయం తెలియజేయగా వారు ఎలాంటి ఖాళీలు లేవని పేర్కొనడంతో తిరిగి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసిన సైబర్ నేరస్తుడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తాము మోసపోయామని గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సీఐ సైదా మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 10 మంది బాధితుల నుంచి ఫిర్యాదులు రాగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాములన్నీ హానికరం కాదు

- ములుగు అటవీ కళాశాల అసిస్టెంట్ శ్రీనిధి
- పంటను సంరక్షిస్తాయి, పర్యావరణాన్ని పరిరక్షిస్తాయి
- విద్యార్థులకు అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న స్నేక్ సొసైటీ సభ్యులు

ములుగు(గజ్వేల్): పాములన్నీ ప్రమాదకరం కాదని, అవి పంటలను సంరక్షిస్తూ పర్యావరణాన్ని కూడా కాపాడుతాయని సిద్దిపేట జిల్లా ములుగు అటవీ కళాశాల, పరిశోధన సంస్థ(ఎఫ్‌సీఆర్ఐ)అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్. ఎన్ఎస్ శ్రీనిధి అన్నారు. కళాశాలలో హైద్రాబాద్‌కు చెందిన ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం పాములపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాములంటే సమాజంలో అందరికీ ప్రతికూల భావన ఉంది కానీ పాములన్నీ ప్రమాదకరమైనవి కాదన్నారు.పాము కాటేస్తే ప్రథమ చికిత్స అత్యంత ముఖ్యమని తెలిపారు. పాములను రక్షించుకొని,పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. సుమారు రెండు గంటలపాటు జరిగిన అవగాహన సదస్సులో విష సర్పాలను, విషం లేని సర్పాలను గుర్తించడం, పాము కాటుకు ప్రథమ చికిత్స చేయడాన్ని ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ సభ్యులు ప్రత్యక్షంగా చేసి చూపించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా విచారణ చేపట్టాలి



సీజ్ చేసిన వాహనాల వివరాలను సీపీకి తెలుపుతున్న ఎస్ఐ అపూర్వరెడ్డి

- పోలీస్ కమిషనర్ అనురాధ
- రూరల్ పోలీస్‌స్టేషన్ సందర్శన
- సిబ్బందికి సూచనలు, సలహాలు

సిద్దిపేటరూరల్: పోలీస్‌స్టేషన్‌లో నమోదయ్యే ప్రతీ కేసులో పారదర్శకతతో కూడిన విచారణను చేపట్టాలని పోలీస్ కమిషనర్ డా.బి అనురాధ అన్నారు. శుక్రవారం రూరల్ పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసర ప్రాంతాలను, సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్, సిబ్బంది కిట్ ఆర్టికల్ , రెస్ట్ రూమ్‌లను తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతీ దరఖాస్తుకు రసీదు ఇవ్వాలని సూచించారు. అంకితభావంతో విధులు నిర్వహిస్తూ, యోగా, వ్యాయామం వంటివి చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. డ్రగ్స్, గంజాయి వంటివాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజాప్రతినిధులతో కలిసి సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలన్నారు. సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించిన సీపీ రికార్డ్స్, సీడీ ఫైల్స్‌ను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా చార్జ్‌షీట్ వేయాలని సీఐకి సూచించారు. అదే సమయంలో ఓ ఫిర్యాదుదారుడు సర్కిల్‌కార్యాలయానికి రావడంతో అతడి నుంచి వివరాలు తెలుసుకొని వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ మధు, రూరల్ సీఐ శ్రీను, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, ఎస్ఐలు అపూర్వ రెడ్డి, ఆసిఫ్, బాలకృష్ణ, కృష్ణారెడ్డి, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే యాదయ్య హత్య

- బూతులు తిట్టాడని కర్రతో కొట్టి చంపిన వైనం
- నిందితుడు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన సీఐ శ్రీను



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను

మద్దూరు(హుస్నాబాద్): ధూళిమిట్ట మండలంలోని బెక్కల్ గ్రామానికి చెందిన బైరిగొని యాదయ్య(52) ఐదు రోజుల కిందట అదృశ్యమై శవమై లభ్యమైన కేసును పోలీసులు ఛేదించారు. శుక్రవారం మద్దూరు పోలీస్ స్టేషన్‌లో చేర్యాల సీఐ శ్రీను హత్య వివరాలను వెల్లండించారు. ఈ నెల 13న ఉదయం 11 గంటలకు అనారోగ్యంతో ఉన్న ఓ పాపను యాదయ్య కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు. ఇదే సమయంలో బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన బాలకృష్ణ బెక్కల్ గ్రామంలో తనకున్న పొలం వద్దకు వెళ్లి వస్తున్నాడు. యాద య్య ఇంటి సమీపంలోకి రాగానే యాదయ్య బాలకృష్ణను "ఇంకా ఎంత మంది ఇళ్లను నాశనం చేస్తావని" తిట్టాడు. ఈ మాటలను మనసులో పెట్టుకొని పెట్టుకున్న బాలకృష్ణ మధ్యాహ్నం 3 గంటలకు యాదయ్యను మద్యం తాగేందుకు తీసుకెళ్లాడు. ఇద్దరూ ఒకే బైక్ పై మద్యం తీసుకొని కూటిగల్ గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్దకు వెళ్లారు. అప్పటికే కోపంతో ఉన్న బాలకృష్ణ పెద్ద కర్రతో యాదయ్యను తలపై తీవ్రంగా కొట్టి చంపేశాడు. అనంతరం పరారయ్యాడు. భర్త రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో ఈనెల 14న భార్య లక్ష్మి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీస్‌లు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 15న కూటిగల్ గ్రామా శివారులోని బ్రిడ్జి వద్ద మృతదేహం లభ్యమైంది. మృతదేహంపై గాయాలు ఉండటంతో హత్య కోణంలో విచారణ ప్రారంభించారు. మద్యం తాగడానికి బాలకృష్ణతో వెళ్లి అప్పటి నుంచి ఇంటికి రాలేదని మృతుడి కుటుంబ సభ్యులు చెప్పడంతో పోలీసులు బాలకృష్ణను శుక్రవారం అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు.వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ షేక్ మహబూబ్, ఏఎస్ఐ విజయ్‌కుమార్‌లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

మరో యువకుడికి తీవ్ర గాయాలు



సాయివర్ధన్ రెడ్డి మృతదేహం

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కుర్షిత్ అలీ కథనం మేరకు.. బీరంగూడ సాయి భగవాన్ కాలనీకి చెందిన సాయి వర్ధన్ రెడ్డి(24) విప్రోలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామంలో స్నేహితుడి ఇంటి వద్ద ఫంక్షన్ ఉండటంతో బీరంగూడలో ఉండే మరో మిత్రుడు వేణుగోపాల్ రెడ్డిని తీసుకొని గురువారం బైక్ పై వెళ్లారు. ఫంక్షన్ పూర్తి చేసుకొని శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో బైక్ పై వస్తుండగా పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బసవేశ్వర విగ్రహం ఎదురుగా జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి పడటంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయి వర్ధన్ రెడ్డి(24) మృతి చెందాడు. వేణుగోపాల్ రెడ్డి చికిత్స పొందుతున్నాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హార్వెస్టర్ ఢీకొని..

హవేళిఘణాపూర్(మెదక్): హార్వెస్టర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మెదక్ మండలం మంభోజిపల్లి వద్ద శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. ఏఎస్ఐ వెంకటయ్య కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా గుండారం గ్రామానికి చెందిన షేక్‌హారీఫ్(36) మెదక్ మండలం మంభోజిపల్లికి ఉపాధి కోసం వచ్చి నిత్యం కల్లు దుకాణంలో మిర్చీల బండిని ఏర్పాటు చేసుకుంటాడు. రోజు మాదిరిగానే బండిని తీసుకెళ్తుండగా మంభోజిపల్లి నుంచి చిట్యాల వైపు వెళ్తున్న హార్వెస్టర్ షేక్‌హారీఫ్‌ను ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలాన్ని పరిశీలించి మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి..



వీరేశం(ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): బైక్ పై నుంచి కిందపడి తీవ్ర గాయాలతో వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం ఏఎస్ఐ మిస్బాఉద్దీన్ కథనం మేరకు.. మండలంలోని చిట్కుల్ గ్రామానికి చెందిన దారబోయిన వీరేశం(49) గురువారం సాయంత్రం దుంపలకుంటు సమీపంలోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. పనులు ముగించుకొని తిరిగి బైక్‌పై ఇంటికొస్తున్నాడు. చిట్కుల్ కస్తూర్బా పాఠశాల సమీపంలో రోడ్డుపై బర్రె అడ్డు రావడంతో తప్పించే క్రమంలో బైక్ పైనుంచి కిందపడిపోయాడు. తలకు తీవ్రగాయాలు జోగిపేట ప్రభుత్వాస్పతికి తరలించారు. పరీక్షించిన డాక్టర్ అప్పటికే వీరేశం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ..

సంగారెడ్డి: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతదేహం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. చౌటకూర్ మండలం గంగోజిపేట గ్రామానికి చెందిన కాశపాగ బాలయ్య కూతురు మమత (24)కి వివాహం కాగా భర్తతో విడాకులు తీసుకొని గ్రామంలోనే నానమ్మ వద్ద ఉంటుంది. మూడు రోజుల కింద ఇంటి నుంచి వెళ్లిన ఆమె చక్రియాల గ్రామ శివారులో హున్నాపూర్ గ్రామం వద్ద సంగారెడ్డి-నాందేడ్, అకోలా జాతీయ రహదారి పక్కన గురువారం మృతదేహమై కనిపించింది. స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న జోగిపేట సీఐ అనిల్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి..



గణేశ్ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. నర్సాపూర్ ఎస్సై లింగం కథనం మేరకు.. మండలంలోని రామచంద్రపూర్ గ్రామానికి చెందిన పేకరి గణేశ్(45) బుధవారం సాయంత్రం కాలకృత్యాల తీర్చుకోవడానికి గ్రామ శివారులోని పెద్ద చెరువుకు వెళ్లాడు. ఎంతసేపైనా ఇంటికి రాకపోవడంతో భార్య నర్సమ్మ గ్రామస్తులతో కలిసి చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. 17వ తేదీ గురువారం పెద్ద చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా గణేశ్ మృతదేహం లభ్యమైంది. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెంది ఉంటాడని భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పాడు.